## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు

ఎదులాపురం, ఏప్రిల్ 30: ఫిర్యాదు చేసినప్పుడు పట్టించుకుంటే వీధి కుక్కల దాడి జరగకుండా ఉండేదని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆదిలాబాద్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆదిలాబాద్‌లో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 24వ తేదీన ప్రజావాణిలో ఇందిరమ్మ కాలనీలో వీధి కుక్కలు, పిచ్చికుక్కల బెడద ఎక్కువ ఉందని ఫిర్యాదు చేశామన్నారు. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోలేదు. మంగళవారం రాత్రి ఇందిరమ్మ కాలనీలో వీధి కుక్కలు, పిచ్చికుక్కలు దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఏఎస్ఐగా విరమణ పొందిన రాథోడ్ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 30: పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐ రాథోడ్ ప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ కేంద్ర వెంకట్‌రావ్‌ను కుటుంబ సభ్యులతో సమేతంగా జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి వారి సమక్షంలో శాలువాతో సతీ సమేతంగా సత్కరించి బహుమతి ప్రదానం చేసి సాగనంపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీ సురేందర్ రావ్, సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కరాటే సెమినార్‌లో మండల కరాటే మాస్టర్లు



సెమినార్‌లో పాల్గొన్న మండల కరాటే మాస్టర్లు

బోథ్, ఏప్రిల్ 30 : కేరళ రాష్ట్రంలో జిమ్మి జార్జ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించిన 12వ ఇంటర్నేషనల్ శితోర్యు కరాటే టెక్నికల్ సెమినార్‌లో బోథ్ మండలం నుంచి కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. టెక్నికల్ సెమినార్ అనంతరం జపాన్ నుంచి వచ్చిన (కేఎస్‌కేఎస్ఐ) ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ సోక్ కేన్యు మబుని, చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ రెన్షి, డాక్టర్ విజయన్ చేతుల మీదుగా టెక్నికల్ సెమినార్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఈ సెమినార్‌లో జిల్లా నుంచి సెడ్మాకి సురేశ్, సోలంకి అశోక్, నారాయణశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లబ్ధిదారుల గృహాల పరిశీలన

ఇచ్చోడ, ఏప్రిల్ 30: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామంలో మంజూరైనా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహాలను బుధవారం ఎంపీడీవో లక్ష్మణ్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించారు. వారికి ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

నార్నూర్, ఏప్రిల్ 30 : సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేకాధికారి గంగధార్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని రైతు వేదికలో బహిరంగ ప్రజావాణి కార్యకమం నిర్వహించారు. పలు సమస్యలతో కూడిన వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో జవహర్‌లాల్, సూపరింటెండెంట్ గంగాసింగ్ పాల్గొన్నారు.


## ఇంటర్ ప్రవేశాల దరఖాస్తులకు స్వీకరణ

ఇచ్చోడ, ఏప్రిల్ 30 : తెలంగాణ మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాలయ సొసైటీ పరిధిలోని జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నర్సాపూర్ ప్రిన్సిపాల్ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైనా విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 12వ తేదీ వరకు సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇంతకు పూర్వం ఎంజేపీలో చదివిన పదో తరగతి విద్యార్థులు నేరుగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ mjptbcwreis.telangana.gov.in సందర్శించాలని లేదా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు.

## నేడు జొన్నల కొనుగోళ్లు బంద్

తాంసి, ఏప్రిల్ 30: మే డే పురస్కరించుకుని తాంసి సబ్ మార్కెట్ యార్డులో గురువారం జొన్న కొనుగోలు జరగవని సీఈవో కేశవ్ తెలిపారు. మే 2 నుంచి గ్రామాల షెడ్యూల్ ప్రకారం జొన్న పంటను అమ్మకానికి తీసుకురావాలని సూచించారు. షెడ్యూల్‌లో లేని గ్రామాల రైతుల జొన్నలను ఎట్టి పరిస్థితుల్లో తూకం వేయరని చెప్పారు. ఈ విషయాన్ని గమనించి భీంపూర్, తాంసి మండలాల రైతులు సహకరించాలని కోరారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాసరెడ్డి

ఎదులాపురం, ఏప్రిల్ 30: సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని డీఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించనున్న ఉచిత సైన్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభిచారు. కార్యక్రమంలో సభ అధ్యకుడు పన్నాల సంజీవ్ రెడ్డి, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఏఎస్‌వో గోవర్ధన్, మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, ప్రధాన కార్యదర్శి ఊశన్న పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

సోన్, ఏప్రిల్ 30: నిర్మల్ మండలం మేడిపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు, పీఏసీఎస్ ఛైర్మన్ గంగాధర్, నరేశ్, మధు, మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పదిలో విద్యార్థుల ప్రతిభ

బోథ్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బోథ్ మండలంలో 99.35 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఆయా పాఠశాలలకు చెందిన 623 మంది విద్యార్థులు (బాలురు 285, బాలికలు 338) పరీక్ష రాయగా 620 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

ఇచ్చోడ, ఏప్రిల్ 30 : పది ఫలితాల్లో సిరికొండలో 80 శాతం, రిమ్మ, రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సాయి ప్రసాద్‌కు 556 మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. ఇచ్చోడ జడ్పీ ఉన్నత పాఠశాలలో 80, తెలంగాణ మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్ విఘ్నేశ్ 566, మణికంఠ రెడ్డి 558, అంజు కుమార్ 558 మార్కులు సాధించి స్కూల్ టాపర్లు నిలిచారు. అలాగే కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఎస్‌వో మల్లిక తెలిపారు.

నేరడిగొండ, ఏప్రిల్ 30 : జడ్పీహెచ్ఎస్ వడూర్, జడ్పీహెచ్ఎస్ నేరడిగొండలో 96 శాతం, జడ్పీహెచ్ఎస్ తేజాపూర్, వాంకిడి, కుమారి, ఏహెచ్ఎస్ లఖంపూర్, కుంటాల, కొర్టికల్‌లో, కేజీబీవీ నేరడిగొండ, టీజీయూఆర్‌జేసీ బుగ్గారంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. కేజీబీవీకి చెందిన ఎ ఆర్తిక 564 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, టీజీయూఆర్‌జేసీ బుగ్గారంకు చెందిన సీహెచ్ ఆర్తి 559 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

తలమడుగు, ఏప్రిల్ 30 : తలమడుగు మండలంలోని 11 ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీలో 408 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 405 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వెంకట్ రావ్ తెలిపారు. తలమడుగు జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, కుచులాపూర్ ఉన్నత పాఠశాల, సాయిలింగి ఉన్నత పాఠశాల, కేజీబీవీ, కజ్జర్ల ఉన్నత పాఠశాల, పల్లి(బీ) ఉన్నత, పాఠశాల, భరంపూర్ ఉన్నత పాఠశాల, ఉమ్రి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, ఝరి పూనగూడ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మండల టాపర్‌గా కేజీబీవీ విద్యార్థిని కే శైలజ 563 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. తలమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థిని మెస్రం కల్యాణి 548 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తాంసి, ఏప్రిల్ 30 : తాంసి మండలంలో జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ, బీసీ గురుకుల పాఠశాలల్లో కలిపి 277 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కప్పర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి గిజ్జ అనుశ్రీ 576 మార్కులు సాధించి తాంసి మండల టాపర్‌గా, ఈదులసావర్గాం గురుకుల పాఠశాల విద్యార్థిని కీర్తన 575 మార్కులు సాధించి రెండవ టాపర్‌గా నిలిచారు.

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 30: భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ పదో తరగతి పరీక్షా కేంద్రంలో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 169 మంది పాసై99.41 ఉత్తీర్ణత శాతం సాధించారు. పిప్పల్‌కోటి జడ్పీఎస్ఎస్ విద్యార్థులు రేండ్ల సంజన, రొడ్డ అరుణ 558 మార్కులతో టాపర్‌గా నిలిచారు. గౌరీష, శ్రీజ 554 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిని ఎంఈవో శ్యాం సుందర్ అభినందించారు.

### గురుకులంలో వంద శాతం ఉత్తీర్ణత

ఎదులాపురం, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాలలో గురుకుల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ లలితాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 11 మంది విద్యార్థులు 550కి పైగా 36మంది 500 పైగా మార్కులు సాధించారు. ప్రథమ స్థానంలో బీ సలోని (576), ద్వితీయ స్థానంలో ఎ వాత్సల్య (569), తృతీయ స్థానంలో ఎం కావ్య శ్రీ(564)మార్కులుతో సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

### మండల టాపర్‌గా దోమకొండ శ్రీధర్

గుడిహత్నూర్, ఏప్రిల్ 30 : గుడిహత్నూర్‌లోని ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థి దోమకొండ శ్రీధర్ పదో తరతి ఫలితాల్లో 534 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. మండలంలో మొత్తం 375 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 369 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 30: ఇంద్రవెల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. మండలంలోని గిరిజన ఆశ్రమ, జిల్లా పరిషత్, కేజీబీవీ, టీటీడబ్ల్యూఎస్ పాఠశాలలకు చెందిన మొత్తం విద్యార్థులు 570మంది పరీక్ష రాయగా 561 మంది ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలిచారు.

### ఆశ్రమాలలో వంద శాతం ఫలితాలు

ఉట్నూర్, ఏప్రిల్ 28: ఐటీడీఏ పరిధిలోని 65 ఆశ్రమ పాఠశాలలు వందశాతం ఫలితాలు రావడం హర్షణీయమని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం పదోతరగతి ఫలితాలు విడుదల సంబురాలను పీవో క్యాంప్ కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆంగ్ల మాధ్యమాలలో పరీక్షలు నిర్వహించినప్పటికీ 65 పాఠశాలలో వందశాతం రావడం సంతోషకరమన్నారు. గత సంవత్సరాల వారిగా ఫలితాలు చూసుకున్నట్లయితే ఆదిలాబాద్ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 91 శాతం, 24-25లో 98 శాతం, నిర్మల్‌లో 2023-24 100 శాతం, 24-25లో 98 శాతం, ఆసిఫాబాద్‌లో 2023-24లో 92శాతం, 24-25లో 98 శాతం, మంచిర్యాల జిల్లాలో 2023-24లో 91శాతం, 2024-25లో 95శాతంగా ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీడీ అంబాజీ, ఏపీఎంవో జగన్, సిబ్బంది వేణు పాల్గొన్నారు.

దస్తురాబాద్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో దస్తురాబాద్‌లోని కేజీబీవీకి చెందిన టీ సాహిత్య 550 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే మండలంలోని మున్యాల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్ స్నేహ 543 మార్కులతో మండల సెకండ్ టాపర్‌గా నిలిచింది. కేజీబీవీ, బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాల, దస్తురాబాద్, మున్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు.

### కడెం మండలంలో 99.39 శాతం

కడెం, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కడెం మండల విద్యార్థులు 99.39 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని ఏడు పాఠశాలల్లో మొత్తం 329 మంది విద్యార్థులకు 327 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

### జిల్లాలోనే కుభీర్ కేజీబీవీ విద్యార్థిని టాప్

కుభీర్, ఏప్రిల్ 28 : కుభీర్‌లోని కేజీబీవీ విద్యార్థిని వీ షణ్ముఖప్రియ పదో తరగతి పరీక్షల్లో 569 మార్కులు సాధించి నిర్మల్ జిల్లాలోని కేజీబీవీలో టాపర్‌గా నిలిచింది. కుభీర్ మండలంలో 285 మంది విద్యార్థులకు 285 మంది కేజీబీవీలో 46 మంది విద్యార్థులకు గాను 46 మంది ఉత్తీరత సాధించారు.

కుంటాల, ఏప్రిల్ 30 : కుంటాల ప్రభుత్వ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్, జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం ఓలా 100 శాతం, ఓలా జిల్లా పరిషత్ తెలుగు మీడియం 92 శాతం, కేజీబీవీ కల్లూరు 95 శాతం, జిల్లా పరిషత్ లింబా (కే) 87 శాతం, కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ముత్యం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

### ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

భైంసా, ఏప్రిల్ 30 : భైంసాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మైనార్టీ బాలుర పాఠశాలలో పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అంతేగాకుండా జడ్పీహెచ్ఎస్ ఏపీ నగర్ పాఠశాలలో 94.12 , జడ్పీహెచ్ఎస్ కిసాన్ గల్లీ బాలికల పాఠశాలలో 96.30, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 90, ఆశ్రమ పాఠశాలలో 97.18, కేజీబీవీలో 97.87 శాతం ఉత్తీర్ణత సాధించారు.

లక్ష్మణచాంద, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జడ్పీఎస్ఎస్ వడ్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. నైనం శృతిక 552, నైనం చైత్ర 547 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ నుంచి 320 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 281 మంది పాసై 87.8 శాతం ఉత్తీర్ణత సాధించారు.

### 92 శాతం..

సారంగాపూర్, ఏప్రిల్ 30: సారంగాపూర్ మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 92శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మధూసూదన్ తెలిపారు. మొత్తం 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి 426 మందికి 396 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. బీరవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీనిధి 563 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే జామ్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థిని శృతి 556, కీర్తన 552 మార్కులు సాధించారు.

### సోన్‌లో 95, నిర్మల్ రూరల్‌లో 94.81శాతం

సోన్, ఏప్రిల్ 30: సోన్‌తో పాటు న్యూవెల్మల్ బొప్పారం, కడ్తాల్, పాక్‌పట్ల, మాదాపూర్, సిద్ధులకుంట, నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్, రత్నాపూర్ కాండ్లీ, అనంతపేట్, చిట్యాల్, ముజ్గి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పది చదివిన విద్యార్థుల ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. సోన్ 95, నిర్మల్ రూరల్ 94.81శాతంలో విద్యార్థులు పాసైనట్లు ఆయా మండలాల ఎంఈవోలు తొడిశెట్టి పరమేశ్వర్, వెంకటేశ్వర్లు తెలిపారు. అదే విధంగా కేజీబీవీ, లెఫ్ట్ పోచంపాడ్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు.

### గురుకుల పాఠశాలలో వంద శాతం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 30: నిర్మల్‌లోని శాంతినగర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డానియల్ తెలిపారు. 79 మంది విద్యార్థులకు 79 మంది ఉత్తీర్ణత సాధించారని అత్యధికంగా 583 మార్కులను ఏ సాహిత్య సాధించినట్లు తెలిపారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పని చేసే హమాలీల పేర్లు పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 30 : వేసవి కాలం కావడంతో కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న హమాలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, పీఏసీఎస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హమాలీల ఎంపిక కార్యక్రమానికి ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హాజరయ్యారు. కొనుగోలు కేంద్రంలో పని చేసే హమాలీల జాబితాను పరిశీలించి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన హమాలీలు వాహనాల్లో జొన్న బస్తాల లోడింగ్ కోసం 30నిమిషాల సమయం ఇచ్చి జొన్నల బస్తాల లోడింగ్‌ను పరిశీలించారు. దీంతో హమాలీలకు ఇచ్చిన సమయానికి ముందే వాహనంలో 250 నుంచి 350 జొన్న బస్తాలను లోడింగ్ చేశారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హమాలీలను అభినందించారు. హమాలీలు విన్నవించిన సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీవో మోహన్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో ధరం సింగ్, అధికారులు తుమ్మల సునీల్, లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

## మహిళలు అప్రమత్తంగా ఉండాలి



కుంటాల: ఓలాలో మహిళను సన్మానిస్తున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

కుంటాల, ఏప్రిల్ 30 : ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా పోలీసులు నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలాలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని వారిపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అంతేగాకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. 100 డయల్‌పై అవగాహన కల్పించారు. పోలీసు చట్టాలపై అవగాహన కల్పించి చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోవద్దని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎం నైలు, ఎస్ఐ అశోక్, వీడీసీ చైర్మన్ ఎగ్గం నర్సింహులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోన్, ఏప్రిల్ 30: నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలో నారీశక్తి మహిళా పెట్రోలింగ్ విధుల్లో భాగంగా ఏఎస్పీ రాజేశ్ మీనా బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగుల విధులు, సైబర్ క్రైమ్, రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మతిభ్రమించింది

భైంసా, ఏప్రిల్ 30 : హైదరాబాద్‌లో బసవేశ్వర జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడాడని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోనే అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని అందుకే మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే సీఎం రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదని, గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అధికారంలోకి రావడానికే కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని వచ్చాక ప్రజలను విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన ప్రజలను చూసి రేవం త్ రెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

తాంసి, ఏప్రిల్ 30 : విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఐరన్ రాడర్ మీద పడి గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన మల్టీపర్పస్ కార్మికుడు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## నిరవధిక సమ్మె విరమణ



కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న వీసీ గోవర్ధన్

బాసర, ఏప్రిల్ 30 : బాసర ఆర్టీయూకేటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు 22 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెను బుధవారం విరమించారు. ఆర్టీయూకేటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ సమ్మె టెంట్ వద్దకు వచ్చి అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మాట్లాడారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, తమ సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ఆలోచిస్తుందని తెలిపారు. అదే విధంగా ఇతర సమస్యల కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేస్తామని వీసీ హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. వీసీ వెంట ఓఎస్‌డీ మురళీదర్శన్, ఏవో రణదీర్, అధికారులు ఉన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి

బోథ్, ఏప్రిల్ 30: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరశైవ లింగాయత్ యువత బసవేశ్వర జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగాయత్ యువ నాయకులు వెండి సోమేశ్వర్, వికాస్ పాటిల్, కేదర్‌నాథ్, మన్మధ్, క్రాంతి, సుమంత్, ప్రజ్వల్, విఘ్నేష్, వేదాంత్, వివేక్ పాల్గొన్నారు.

భైంసా, ఏప్రిల్, 30 : నిర్మల్ జిల్లా భైంసాలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో బుధవారం బసవేశ్వర్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరశైవ లింగాయత్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మారుతి, నాగభూషణ్, తదితరులు ఉన్నారు.



బోథ్: బసవేశ్వరుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

## పోలీసుల గౌరవం పెరిగేలా విధులు నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 30 : పోలీసుల గౌరవం పెరిగేలా హోంగార్డులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. బుధవారం నిర్మల్‌లోని జిల్లా సాయుధ దళ కార్యాలయంలో హోంగార్డుల పరేడ్‌కు హాజరై ప్రజా దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోంగార్డులు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. నారీశక్తి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వెంకటాపూర్ కాలనీలో మహిళా కానిస్టేబుళ్లు ప్రజలకు అవగాహన కల్పించారు. షీటీం సేవలు, భరోసా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



పరేడ్ నిర్వహిస్తున్న హోంగార్డులు

### ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కుభీర్, ఏప్రిల్ 30: నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన చౌరే శ్రీకాంత్ (35) కొంత కాలంగా మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఎవరితోనూ మాట్లాడకుండా మానసికంగా తనలో తను కుంగిపోతూ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు దిలీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు.

### పాముకాటుతో ఎద్దు మృతి

పెంబి, ఏప్రిల్ 30: నిర్మల్ జిల్లా పెంబి మండలం మెరునిపరుపు గ్రామంలోని ఆత్రం లక్ష్మణ్‌కు చెందిన ఎద్దులను సోమవారం పశువుల పాకలలో కట్టేశాడు. అదే రోజు రాత్రి పశువుల పాకలో ఉన్న ఎద్దుకు పాము కాటేసింది. ఉదయం ఎద్దు పడిపోయి ఉండడంతో ఎద్దుకు వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఎద్దు మృతిచెందింది. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 30: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం రాత్రి ఇంద్రవెల్లి మండలం ధనోరా(బీ) గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది ఆత్రం ఆశోక్, కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...ఇంద్రవెల్లికి చెందిన జునైద్ ద్విచక్ర వాహనంపై ఇంద్రవెల్లి నుంచి గూడిహత్నూర్ వైపు వెళ్తుండగా ధనోరా(బీ)గ్రామ సమీపంలో ఫిట్స్ రావడంతో ఎదురుగా కాలినడకన వస్తున్న ధనోరా(బీ) గ్రామానికి చెందిన శివరాజ్‌పాటిల్‌కు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివరాజ్‌పాటిల్ కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా జునైద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఇద్దరిని 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

బేల, ఏప్రిల్ 30: భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూ భారతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై భూ భారతిపై ప్రజలకు పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి మనోహర్, తహసీల్దార్ రఘునాథ్ రావ్, ఎంపీడీవో మహేందర్ కుమార్, ఐకేపీ ఏపీఎం సుజాత, డిప్యూటీ తహసీల్దార్ వామన్, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జైనథ్, ఏప్రిల్ 30: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో జిల్లాలో ఉన్న భూ సమస్యలు సత్వరంగా పరిష్కరిస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జైనథ్‌లోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ ఆత్రం నారాయణ, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రుకేశ్ రెడ్డి, ఎంపీడీవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

### మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

కడెం, ఏప్రిల్ 30 : మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డు ప్రమాదాల బారీన పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని కడెం ఎస్ఐ కృష్ణ సాగర్‌రెడ్డి అన్నారు. బుధవారం కడెంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు మైనర్లకు ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు ఇచ్చి ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులు, వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నారీశక్తిలో భాగంగా మహిళ పోలీసులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వంశీ, లావణ్య, ఆకాంక్ష, శాకీర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

### భైంసా, నర్సాపూర్, నిర్మల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు

భైంసా, ఏప్రిల్ 30 : భైంసా నుంచి నర్సాపూర్, నిర్మల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు ప్రారంభించినట్లు డీఎం హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఉద్యోగ రీత్యా విరమణ సహజమే

దస్తురాబాద్,ఏప్రిల్30 : ఉద్యోగరీత్యా విరమణ సహజమే అని ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన లక్ష్మీ నారాయణ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీఐ అజయ్, ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ భీం రావ్, హెడ్‌కానిస్టేబుళ్లు ద్వెకర్, గోకుల్, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్య పరిష్కారం

బాసర, ఏప్రిల్ 30 : నిర్మల్ జిల్లా బాసర మండలం టాక్లి గ్రామంలో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించి విద్యుత్ సమస్యను పరిష్కరించినట్లు భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు తెలిపారు. గ్రామంలో వ్యవసాయానికి నాలుగు నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు ఏఈ, డీఈలకు తెలిపి తక్షణమే స్పందించి వారు మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీకి కార్యకర్తలు, అధికారులకు రైతులు అభినందనలు తెలిపారు.

### ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యబోధన

దిలావర్‌పూర్, ఏప్రిల్ 30 : ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యబోధన అందిస్తున్నామని ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించిందని అన్నారు. అధ్యాపక బృందం పాల్గొన్నారు.